# క్లెప్టోమేనియా ★

రచన : వి. వి. సూర్యనారాయణ

ఆ అమ్మాయి గదిలో ఒకసారి యిటూ, అటూ తిరిగింది. తొడుక్కున్న దుస్తులు తీసేసింది. నైట్ డ్రస్ ధరించింది. మంచం దగ్గరకొచ్చింది. పరుపుమీద పడుక్కుంది. కనురెప్పలు వాలిపోయాయి. ఎర్రని పెదవులు నవ్వినట్లు తెరుచుకున్నాయి. గదినిండా ఒక్కసారి వెయ్యి దీపాలు పెట్టినకాంతి వచ్చింది. ఆమెకు నిద్రాభంగమయింది. వెంటనే పరుపుక్రిందినుండి రివాల్వరు తీసింది. ఒకసారి నాల్గువైపులా పరికించి చూసింది. తనలో తను నవ్వుకుంది.

"మంచంక్రిందినుండి లేచి రావోయ్ నేస్తం!" అంది రివాల్వరు చూపెడుతూ.

"ఓహో! కోయిలకంఠం" అనుకున్నాడు మంచంక్రింది మనిషి. మెల్లగా కదలి ముందుకువచ్చి నించున్నాడు, ఆమె ముఖంకేసి చూసినవ్వుతూ. కాని రివాల్వరు చూసి లోపల కొద్దిగా భయపడుతూనే వున్నాడు.

* * *

మనిషినిచూస్తే దొంగతనంవల్ల బ్రతకవలసినవాడుగా కనపడ్డంలేదు. కాని అతను దొంగ. పైగా గజదొంగ. మధ్యరకం కుటుంబానికి చెందినవాడు. ముఖంచూస్తే బాగా చదువుకున్నవాడని తెలుస్తుంది. పెద్దపెద్ద ఉద్యోగాల్లోవున్న బంధువులతనికి చాలామంది వున్నారు. అతనట్టే వయసుచెల్లినవాడుకూడా కాదు. అతని వయసు పాతిక సంవత్సరాలకు పైనుండదు. మనిషి స్ఫురద్రూపి. ఉంగరాలు తిరిగి ముఖంమీద పడే అతని జుట్టూ, విశాల వక్షస్థలం, ఎన్నడూ చిరునవ్వులోనుండే ముఖమూ, స్త్రీలను అతి సులువుగా ఆకర్షిస్తాయంటే అతిశయోక్తి కాదు. అతను యిళ్ళల్లోకి చొరబడి దొంగతనంచెయ్యడం వృత్తిగా అలవాటు చేసుకున్నాడు.

ఈవాళ కొనలా వీధిలో ఊసుపోక తిరుగుతూవుంటే మేడమీది కిటికీలోనుండి వచ్చే వెలుతురు తన్నాహ్వానించింది. కిటికీ తలుపు బారుగా తెరుచుకొనివుంది. బాగుంది. మనం ఇక్కడ ఎందుకు ప్రయత్నించకూడదూ అనుకున్నాడు. నీటిగొట్టంమీదుగా మీదకెక్కి పిట్టగోడమీదుగా లోపలికి దిగేడు. బారుగా తెరచివున్న గదిద్వారంలోంచి పడకగది ప్రవేశించాడు. బెడ్‌రూమ్‌బల్బు కాంతిలో నవ్వినట్లు తెరచుకున్న ఆమెపెదవుల తన్నాహ్వానించాయి. అంతదూరం నుండే ఆమె లావణ్యాన్ని అర్థంచేసుకోలేక దగ్గరగావెళ్ళి నిద్రితముఖంమీద టార్చిలైటు వేశాడు. గదినిండా వెయ్యిదీపాలుపెట్టిన కాంతి వచ్చింది. దిగ్భ్రమచెందిన అతనికి అది తన టార్చిలైటు వెలుతురో లేక ఆమె వదన చంద్రబింబం నుండి వెలువడ్డ వింతవెన్నెలో అర్థంకాలేదు. అప్పటికీ తృప్తిపొందలేని ఆ సౌందర్యపిపాసి వెన్నెలలో విరియిస్తూన్న ఆమె ముఖాన్ని సాధ్యమయినంత దగ్గరలో చూడాలని ఉబలాటపడ్డాడు. కళ్ళింతలేసి చేసుకొని అతిజాగ్రత్తగా తనముఖానామె ముఖంమీదికి ప్రమాదంలేదని తనకు ధైర్యమున్నంతవరకూ వంచాడు. ఉద్రేకంలో వశంతప్పి స్పందిస్తూన్న అతని పెదవులు ఆమె పెదవులను తాకాయి. నిద్రిస్తూన్న సుందరి ఉలికిపడి లేచింది. ఆమెకు నిద్రాభంగమైంది. వెంటనే పరుపుక్రిందినుండి రివాల్వరు తీసింది. అంతవరకూ స్వర్గసైకతాల్లో విహరిస్తూన్న అతని పిరికిమనస్సు మంచంక్రింద దూరమని హితబోధచేసింది. వెంటనే ఆత్మసందేశాన్ని మన్నించాడు. మంచంమీది సుందరాంగి ఒకసారి నాల్గుమూలలా పరికించి చూసింది. తనలో తను నవ్వుకుంది.

"మంచంక్రిందినుండి లేచి రావోయ్ నేస్తం!" అంది రివాల్వరు చూపెడుతూ.

"ఓహో! 'కోయిలకంఠం' అనుకున్నాడు మంచంక్రింది మనిషి. మెల్లగా కదలి ముందుకువచ్చి నించున్నాడు ఆమె ముఖం వైపుచూసి నవ్వుతూ. కాని తనవైపు గురిపెట్టబడివున్న రివాల్వరునుచూసి లోపల కొద్దిగా భయపడుతూనే వున్నాడు.

* * *

"ఎందుకొచ్చినట్లు?" శూన్యంలోకి చూస్తూ, ఎవరినో ప్రశ్నించినట్లు అడిగింది మంచంమీది మగువ.

పారిపోవడానికి దారి వెతికేవాడికిమల్లే దిక్కులుచూస్తూ మాట్లాడలేదాతడు.

"దొంగతనానికా?"

"అవును" అన్నట్లు తల ఆడించాడు.

"ఐతే మంచంక్రింద దూరావేం?...... ఐనా యింత పిరికివాడివి నువ్వు దొంగతనమేంచేస్తావు?" అని ఆమె కొంటెగాచూసి చిరునవ్వి నవ్వింది.

ఆనవ్వు చూశాక అతనికి కాస్త ధైర్యం కలిగింది. "నిన్నుచూడగానే దొంగతనానికొచ్చినసంగతి మర్చిపోయాను." అతనుకూడ చిలిపిగా నవ్వుతూ ఆమె కళ్ళల్లోకి సూటిగా చూశాడు. ఇద్దరిచూపులూ ఒక్కక్షణం కలుసుకున్నాయి. అతనిచూపుల్లోవున్న యేదో మహత్తరశక్తి ఆమెను వివశను చేసింది. మదనుని తూపుల తాకిడికి ఆమె శరీరమంతా ఒక విద్యుత్ప్రసారం కలిగినట్లు జలదరించింది. కొంచం తమాయించుకొని, ముఖం కాస్త ఓరగాపెట్టి "ఐతే యిప్పుడేమీ దొంగిలించదల్చుకోలేదన్నమాట! అంతేనా?" అని ఆమె విరగబడి నవ్వింది.

"నాకన్న ముందు నీవే ఆపని చేశావు" అన్నాడు బాగా ధైర్యంతెచ్చుకుని.

"గట్టివాడివే. నాకే అంటగడుతున్నావన్నమాట!"

"కాకపోతే మరేమిటి? నా మనస్సు, నా వివేచనాశక్తి దొంగిలించావు."

"సరిసరి. మాటలు నేర్చిన మగాడివే."

"బి. ఏ. ప్యాసైనాక ఆమాత్రం మాట్లాడ్డంకూడా చేతకాకపోవాలి?"

"ఏమిటీ! ఇంకా చెప్పేవుకాదూ? ఐతే నువ్వు దొంగలాగా తిరగడం ఏంకర్మ?"

"దొంగలాగా యేమిటి? నేను దొంగనే. మూడుసార్లు నన్ను జైల్లో కూర్చోపెట్టి దొంగనన్న సర్టిఫికేటు కూడా యిచ్చేరు నాకు."

ఏవిషయంలోనూ దాపరికం లేకుండా ఉన్నదున్నట్లు చెప్పడంవల్ల సావిత్రికి అతని మీద సానుభూతి యేర్పడింది.

"అయితే నీపేరు?"

"ప్రకాశం"

"ప్రకాశం బి. ఏ. అనూ"

"అనొచ్చుగాని, అనిమాత్రం ఏం లాభం? అయినా, నాపేరడిగి, నీపేరు చెప్పకపోవడం యేం బాగా లేదు"

"నన్ను సావిత్రి అంటారు. దానికేంగాని, నే నెవరో నీకు తెలుసా?"

"ఏం?"

"ఆహాఁ! తెలుసా అని?"

"తెలియడానికి నువ్వేమయినా గవర్నరు హోదాలో వున్నావా?"

"సరి! అంతకంటె పెద్ద హోదాలోనే వున్నానులే. గవర్నరుని తెలియనివాళ్లయినా వున్నారుగాని, నన్ను తెలియనివాళ్ళు..."

"అయితే కావచ్చు. నాకు నిన్ను తెలిసి వుండాలని వ్రాసివుందా యెక్కడైనా?

"నేను సినీమాస్టారునోయ్ వెర్రివాడా? నన్ను సినీమాల్లో చూడలేదా?"

"నే నసలు సినీమాలే చూడనుగా"

"పోనీ పత్రికలమీద ముఖచిత్రాల్లోనైనా చూడలేదా?

"అసలు పత్రికలంటే నాకు వళ్లుమంట"

"అయితే నువ్వీ యుగంలో పుట్టవలసిన వాడవుకావు."

"కాని పుట్టేను."

"ఎందుకూ దండగ"

"ఎప్పటికీ కాదు. నీ బొమ్మను పత్రికల్లోనూ సినీమాల్లోనూ చూసే వాళ్ళకన్న నేనే మెరుగు. నిన్ను — నీ రూపాన్ని, ప్రాణంతోవున్న నిన్ను ముఖా ముఖీగా, బారెడు దూరంలో నించుని చూస్తున్నాను. అనుమతిస్తే యింకా దగ్గరగావచ్చి చూడ్డానికి నాకేమీ అభ్యంతరంలేదు, ఉండబోదు."

"నీతో మాట్లాడ్డం కష్టమే! పాపం వచ్చినదగ్గరనుండీ నించునేవున్నావు. కూర్చోరాదూ?"

"బాగానే వుంది మర్యాద. గదిలోవున్న ఒక్క మంచం నీ స్వాధీనంలోవుంది. నే నెక్కడ కూర్చొనేది?"

"నా సరసనే" రివాల్వరును ప్రక్కను విసిరేసింది సావిత్రి ప్రకాశంవైపు కొంటెగా క్రీగంట చూసి నవ్వుతూ.

*   *   *

మర్నాడుదయం సావిత్రి లేచేసరికి గడియారం తొమ్మిది గంటలు కొడుతూంది. ప్రకాశానికింకా తెలివిరాలేదు.

"దొంగతనంచేసేవాళ్ళకి కూడా యింత నిద్రమత్తయితే ఎలాగబ్బా!" అంటూ ప్రకాశాన్ని కూడా నిద్రలేపింది. ఆ తరువాత క్రిందకు వెళ్ళి కాఫీ ఫలహారం యిద్దరికీ తెమ్మని వంటమనిషికి పురమాయించి మేడ మీద కొచ్చింది. వంటమనిషి కాఫీ తీసుకొచ్చేసరికి ప్రకాశం, సావిత్రీ ముఖాలు కడుక్కుని టేబిల్ ముందు కూర్చున్నారు కాఫీ త్రాగడానికి.

కాఫీత్రాగుతూ అడిగింది. "నీకు పెళ్ళయిందా?"

"ఆ సందేహం యిప్పుడు కలిగిందేం?"

"ఎప్పుడు కలగాలి?"

"రాత్రే కలిగివుండాల్సింది. అయినా ఎందుకేం?"

"ఎందుకేమిటి? నాకింకా పెళ్ళికాలేదు కనుక"

"ఓహో! అలాగా? నేనింకా బ్రహ్మచారినేలే"

"నిన్నరాత్రివరకూనా?" సావిత్రి కిలకిలా నవ్వింది. ప్రకాశంకూడా నవ్వాడు.

*   *   *

సావిత్రికీ ప్రకాశానికీ పరిచయమై చెలరోజులయింది. ప్రకాశం కనబడకపోతే ఒక క్షణమైనా గడపలేని స్థితికి వచ్చింది సావిత్రి. కాల్ షీట్ ఉన్నప్పుడుమాత్రం షూటింగ్‌కి పోవడంతప్ప, తదితర సమయాల్లో ఎప్పుడూ ప్రకాశాన్నే అంటిపెట్టుకొనివుండేది. ఇద్దరూ వివాహంమాత్రం చేసుకోకపోయినా, వివాహితులకంటె సన్నిహితులుగా సంచరించడం నేర్చుకున్నారు. సావిత్రి ఒకరిద్దరు సన్నిహితులతో తాను ప్రకాశాన్ని వివాహంచేసుకోబోతూన్నట్లు కూడా సూచించింది.

సంపాదన లేదన్న దిగులు ప్రకాశానికి లేదు. ఉన్ననాడు తినడం లేనినాడు మానడం ప్రకాశానికి అలవాటే. తను సంపాదించినదే తరగకుండా వున్నప్పుడు ప్రకాశంకూడా కష్టపడి సంపాదించడం ఎందుకూ అనే ధోరణిలో సావిత్రి వుంది.

సావిత్రి ఎక్కడికి వెళ్ళినా సాయంత్రం అయిదు గంటలలోపున తిరిగి యింటికి రావడము అలవాటు. అంతవరకూ ప్రకాశం ఆమె కోసం నిరీక్షిస్తూ కూర్చుంటాడు. మామూలు వేళ దాటినా సావిత్రి ఆ నాడింటికి చేరలేదు. అప్పుడే ప్రొద్దు గ్రుంకుతోంది. మేడమీద వరండాలో ఒంటరిగా కుర్చీలో చేరబడి కూర్చున్నాడు ప్రకాశం. అతనిచూపు హటాత్తుగా ఎదురింటిమీద పడింది. ఆ ఇంటి తలుపులు బారుగా తెరచివున్నాయి. గుమ్మాని కెదురుగా టేబుల్ మీద పడవేసిన బంగారు గొలుసు మెర్క్యురీవైటుకాంతిలో ధగ ధగ మెరుస్తూంది. ఆయింటి చుట్టుప్రక్కలగాని, యింటిలోగాని మనుష్యులున్న అలికిడి లేదు. ప్రకాశానికి ఆ గొలుసు దొంగిలిద్దామనే బుద్ధికలిగింది. నిజానికి ప్రకాశం యిప్పుడున్న స్థితిలో దొంగతనం చెయ్యవలసినంత అవసరమేమీ లేదు. కాని అతనిలోని ఏవో అజ్ఞాత శక్తుల ప్రేరేపణ బాగా పనిచేసింది. ఆ సమయానికి సావిత్రి దగ్గరలో లేకపోవడంవల్ల అతని ఉద్దేశానికి దోహదం కలిగింది. మెల్లగా కూర్చున్న స్థలంనుండి లేచి మెట్లుదిగి గుమ్మంలోకి వెళ్ళాడు. వీధితలుపుతీసేసరికి స్టూడియోనుండి తిరిగివచ్చిన సావిత్రి ఎదురైంది.

"ఎక్కడికో బయలు దేరుతున్నట్లుంది షికారా?" అన్నది సావిత్రి.

"అచ్చే కాదు"

"మరెక్కడికి?"

"లేదు లేదు షికారే" తడబడుతూ ముందుకు పోతూన్నవాడు వెనక్కు తిరిగాడు.

సావిత్రి అతని తడబాటును గుర్తించకే "నేనూ వస్తాను బట్టలు మార్చుకుని" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

సావిత్రిని స్టూడియోనుండి తీసుకొని వచ్చిన కారు మరొక అరగంటకల్లా యిద్దర్నీ మెరీనాలో దించింది. ప్రకృతి సౌందర్యాన్ని ఒకరికొకరు అన్వయించుకుంటూ, మూడో మనిషికి అర్థంకాని మూగభాషలో మనసులు విప్పి చెప్పుకుంటూ ఎంతకాలం గడిపేరో కాని, వారికి స్మృతి వచ్చేసరికి బీచి అంతా నిర్మానుష్యంగా వుంది. అప్పటికే ఆకాశం మీద బారెడుదూరం మీదకువచ్చిన చంద్రుణ్ణి అందుకోవాలని కాబోలు సముద్రతరంగాలు ఉవ్వెత్తుగా మీదికి లేచి విరిగిపడుతున్నాయి.

సావిత్రి ప్రకాశం ఒడిలోకి తలదూర్చి గోముగా పల్కరిస్తూ, "మనయిల్లు అమ్మేకాను తెలుసా?" అంది.

"నువ్వు చెప్తేగా తెలియడానికి. అయినా ఎందుచేత?" అన్నాడు. ప్రకాశం గాలికి ఆమె పాలబుగ్గలమీద నాట్యంచేసే ముంగుర్లను సవిరిస్తూ. "కీల్పాక్‌లో ఇంతకన్న మంచియిల్లు కొన్నాను. రిజిస్ట్రేషన్ కూడా అయిపోయింది యివాళే. అందుకే నేనింటికి రావడం ఆలస్యం అయింది."

ప్రకాశం మృదువుగా ఆమె చెంపల్ని తాకుతూ అన్నాడు. "సాయంత్రం నువ్వు రావడం ఒక గంట ఆలస్యమైతే ఆ గంటా నాకొకయుగంలాగా అనిపించింది సావిత్రీ!"

"నాకూ అలాగే వుంటుంది, ఏముహూర్తాన మనకు పరిచయంకలిగిందో కాని, అప్పటి నుండి నీతోలేని ఒక క్షణం ఒక సంవత్సరమంత దీర్ఘంగా ఉన్నట్లనిపిస్తుంది."

కాస్సేపు నిశ్శబ్దంగా ఊరుకున్నాక సావిత్రి పిలిచింది ప్రకాశాన్ని "ప్రకాశం!"

"ఏం?" అన్నట్లు చూశాడు ఆమె కళ్ళల్లోకి.

"రేపు నేను ఔట్‌డోర్ షూటింగ్‌కి మైసూర్ వెళ్ళాలి. మళ్ళా తిరిగి వచ్చేసరికి వారంరోజులు అవుతుందేమో!"

"వారం రోజులే!"

"అవును నిన్ను విడిచివెళ్ళడం అంటే ఎక్కువ బాధగావుంది. కాని తప్పదు. ఈ వారంరోజులూ ఎలాగో అలా గడపాలి. తిరిగిరాగానే కొత్త యింట్లోకి పోదాం."

"షూటింగ్‌కి వెళ్ళకపోతే వీల్లేదా?"

"బాగుండదు ప్రకాశం! నన్ను నమ్ముకుని వాళ్ళంతా సిద్ధంచేసుకున్నాక నేను వెళ్ళకపోవడం అమర్యాదగా వుంటుంది"

"సరే" అన్నాడు ప్రకాశం కష్టంమీద.

* * *

అనుకున్న గడువుకు ఒకరోజు ముందే తిరిగివచ్చింది సావిత్రి మైసూర్‌నుంచి. ఆమె వస్తూనే ప్రకాశంకోసం చూసింది. అతను కనపడలేదు. వెంటనే బంట్రోతునుపిల్చి అడిగింది "ఎంరా సాంబు! ప్రకాశం ఎక్కడ?"

వాడుచేతులు నలుపుకుంటూ నిల్చొని జవాబిచ్చేడు, "అయ్యగార్ని జైల్లో పెట్టేరండమ్మా!" అని.

"ఏంరా! అసలేంజరిగింది?" అని ఆదుర్దాగా ప్రశ్నించింది సావిత్రి.

"అయ్యగారెక్కడో దొంగతనం చేశారట. అయ్యగారేంటి, దొంగతనం చెయ్యడమేంటి? నాకేం నమ్మకంలేదు. అంతా ఏదో మాయగావుంది."

సావిత్రి ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చి కుర్చీలో కూలబడింది. సావిత్రి జీవితంలో ప్రకాశం విచిత్రంగా అడుగుపెట్టేడు. అతన్ని గురించి సావిత్రి ఎన్నో తియ్యని కలలుకంది. ఇంతవరకు ఎవ్వరికీ అంకితంకాని తన హృదయం పుట్టుమొదటిసారిగా ప్రకాశానికి స్వాధీనం చెయ్యబడింది. ఇద్దరికీ హృదయాలు కలిశాయి. అతను లేకపోవడం సావిత్రి దృష్టికి యిల్లంతా బావురుమంటూన్నట్లుంది. ఈమధ్య తనూ ప్రకాశం కలిసి తీయించుకున్న ఫోటో గోడమీదనుండి వెక్కిరిస్తూన్నట్లు కనిపిస్తూంది. ఒంటరిగా ఆయింట్లో ఒక్కక్షణమయినా ఉండడానికామెకు మనస్కరించలేదు.

"ఒరే సాంబు! క్రొత్తయింట్లోకి యీవాళే సామానంతా మార్పించెయ్యాలి. బళ్ళు పిలిపించు."

"తొందరెందుకమ్మగారూ! మంచిరోజు చూసుకునివెళ్తే బాగుంటుందేమో!"

"మంచీలేదు, చెడ్డాలేదు. చెప్పినట్లు వెంటనే చెయ్యడమే నీపని."

ఎప్పుడూ శాంతంగావుండే యజమానురాలు కోపంగా మాట్లాడ్డం చూడ వాడు కాస్త భయపడ్డాడు. సామాను క్రొత్తయింటికి తర్లించేప్రయత్నం చెయ్యడానికి మేడ దిగి వెళ్లిపోయాడు. విచారభారంతో సావిత్రి తల ముందున్న టేబిల్ మీదకు వాలిపోయింది. ఆనాడే క్రొత్తయింట్లో ప్రవేశం జరిగింది.

మర్నాడు తెల్లవారేసరికి సావిత్రికి విపరీతంగా జ్వరంవచ్చింది. డాక్టరు పరీక్షచేసి మందుయిచ్చి వెళ్ళిపోడానికి లేచాడు. నాలుగడుగులు ముందుకువేసి సావిత్రీ — ప్రకాశం కలిసి తీయించుకున్న ఫోటోదగ్గర ఆగిపోయాడు. గోడదగ్గరగావెళ్ళి ఆఫోటోవైపు తదేకదీక్షగాచూసి మళ్ళీ వెనక్కుతిరిగి సావిత్రి మంచాని కదురుగావున్న కుర్చీలో కూర్చున్నాడు. ఇదంతా గమనిస్తూన్న సావిత్రికి హృదయాంతరాళంలో అణగివున్న దుఃఖం కట్టలు తెంపుకుని ప్రవహించింది. ఆమెతలగడాలో ముఖందూర్చి వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

డాక్టరుకు సావిత్రిచర్య అయోమయంగా వుంది. "ఏమమ్మా! అతనిపేరు ప్రకాశం కాదూ? ఆ ఫోటో మీయిద్దరికీ గాఢమైత్రి వున్నట్లు తెల్పుతూంది. నీ దుఃఖానికి కూడా అతనితో సంబంధించిన కారణమేదయినా వుండివుండాలని నేనూహిస్తున్నాను. అంతేనా?" అన్నాడు సానునయంగా.

ఆమె జవాబైతే చెప్పలేదుగాని, ముఖం పైకెత్తి 'అవును' అన్నట్లు కళ్ళు అల్లార్చింది. తరువాత 'అతన్ని మీకుతెలుసు?' అన్నది.

"అతన్ని నాకు తెలుసు. అతనూ నేనూ కలిసి చదువుకున్నాం. నాకువున్న కొద్దిమంది స్నేహితుల్లో అతనొకడు. కొనసీమలో చెప్పుకోవలసిన భాగ్యవంతుల్లో

అతని తండ్రి రామస్వామిగారొకరు. ఆయనకు మొదటిభార్యవల్ల కలిగేడు ప్రకాశం.

ఏడుసంవత్సరాలక్రితం నేను మెడికల్ కాలేజీలో రెండోసంవత్సరం చదువుతున్నాను. ప్రకాశం కాకినాడలో బి. ఏ. ప్యాసై మెడిసిన్ చదవడానికి మా కాలేజీలో చేరాడు. హాస్టల్‌లో మేమిద్దరం ఒకేగదిలో వుండేవాళ్లం. బి. ఏ. ప్యాసవగానే అతని చదువు ఆపివెయ్యడానికి అతని సవతితల్లి చాలా ప్రయత్నించిందట! కాని, అతను తండ్రిదగ్గర ఎంతో ప్రాధేయపడి తను మెడిసిన్ చదవడానికి అతికష్టంమీద ఆయన్ను ఒప్పించగలిగాడు. ఇంతో అంతో మానవసేవ చెయ్యడానికి ఉపయోగపడే వృత్తి స్వీకరించాలనీ, తను డాక్టరు కాగలిగితే ఆ పని సాధ్యమవుతుందనీ అతని దృఢవిశ్వాసం. భార్యమాటలు విని తన తండ్రి తన చదువును బి. ఏ. తో మాన్పించనందుకు తండ్రి నెంతో అభినందించేవాడు."

సావిత్రి శ్రద్ధగా వింటూంది.

"అయితే ఒకనాడు తండ్రిదగ్గర నుండి వచ్చిన ఉత్తరం ప్రకాశం జీవితాన్ని తారుమారు చేసింది. ఆ ఉత్తరం చూసుకుని అతను నీరైపోయాడు. ఆ ఉత్తరంయొక్క పూర్తిసారం ఏమంటే, ప్రకాశం చదువు మానుకుని వెంటనే యింటికి రావాలనీ, వున్న డబ్బంతా అతని చదువుకే వెచ్చించేస్తే యింకా చదువుకోవలసిన అతని తమ్ముళ్ళూ, పెళ్ళిళ్ళు కావలసిన చెల్లెళ్ళూ తమ భవిష్యత్తును పాడుచేసుకోవలసి వస్తుందని. అధమం ప్రకాశంకొరకు డబ్బు వెచ్చించి అతనికి చదువు చెప్పించినా ముందుముందు అతను తమ్ముళ్లనీ, చెల్లెళ్ళనూ సుహృద్భావంతో చూసి వాళ్ళ అవసరాలకు ఆదుకుంటాడనే నమ్మకంకూడా తనకులేనట్లు వ్యక్తపరిచాడు.

ఉత్తరం చూసుకోగానే ప్రకాశం ఎదురుగావున్న నావైపు చూసి 'ఇదంతా నా మారుటితల్లి ప్రోద్బలంవల్లనే జరిగివుంటుంద'న్నాడు. తరువాత ప్రకాశం ఎంతో ప్రాధేయపడుతూ తండ్రికి రెండు మూడు ఉత్తరాలు వ్రాశాడు తన చదువు పూర్తిచేయించమని. కాని జవాబైనా రాలేదు తండ్రిదగ్గర నుండి. మరొకనాడు ప్రకాశం నను పిలిచి చెప్పేడు 'నేను సైకిలూ, రిస్టువాచీ ఇంకా కొన్ని ఖరీదైన వస్తువులూ అమ్మివెయ్యదల్చుకున్నాను.'

'అమ్మిజేసి ఏంచేస్తావ్?' అన్నా.

'నా చదువు కొన్నాళ్లైనా గడుస్తుంది.'

'ఆ తరువాత?'

'ఈలోపున మా నాన్నగారిబుద్ధి మళ్ళకపోదు.'

"నేనింకేమీ మాట్లాడలేదు. కాని అతన్ని చూస్తే జాలేసింది. ఆ తరువాత అతను కొన్ని వస్తువులు అమ్మివెయ్యడం కొన్ని రోజులు గడిచిపోవడంకూడా జరిగింది. అది అయిపోయిన తరువాత నేనుకూడా చేబదులు క్రింద అతనికి నాలుగైదుసార్లు డబ్బు యిచ్చేను. వారంవారం తండ్రికి తన పరిస్థితిని తెలియజేస్తూ డబ్బుపంపమని ప్రకాశం వ్రాస్తూనేవున్నాడు; ప్రత్యుత్తరంకోసం ఎదురు చూస్తూనే వున్నాడు.

ఒకనాడు నేను కాలేజినుండి హాస్టల్ కొచ్చేసరికి ప్రకాశం గదిలో ఒంటరిగా కూర్చున్నాడు. అతని ముఖం హృదయగత విచారాన్ని ప్రతిఫలిస్తూంది. నన్ను చూడగానే వెక్కివెక్కి ఏడుస్తూ, 'నా జీవితంలో ఎన్నడూ చెయ్యని తుచ్ఛమయిన పని చేశానివాళ' అన్నాడు. నే నర్థంచేసుకోలేక అతని ముఖంలోకి చూశాను. అతను కొంతసేపు ఊరుకుని మళ్ళా చెప్పేడు 'నేను వరండాలో తిరుగుతూవుంటే మూడోనంబరు గదిలో టేబుల్‌మీద మనీపర్సు కనిపించింది. గదిలో ఎవరూలేరు. గదికి తాళంకూడాలేదు. ఆ పర్సును నేను దొంగిలించాను. నువ్వు నమ్మడంలేదు. కాని నేను నిజంగానే దొంగిలించాను.' మళ్ళా వెక్కివెక్కి యేడ్వడం మొదలుపెట్టేడు ప్రకాశం.

'ఎంతపనిచేశావు ప్రకాశం! ఎవరికైనా తెలిస్తే ఎంత నగుబాటు! డబ్బు యిలా తే. నేను తీసుకెళ్ళి నచ్చజెప్పి ఇచ్చేస్తా' అన్నా.

'ఇవాళ కాలేజికి జీతం కట్టడానికి ఆఖరు రోజు కదూ? ఆడబ్బు తీసుకెళ్ళి జీతం కట్టేశాను' అన్నాడు ప్రకాశం నావైపు భావరహితంగా చూస్తూ.

"నాకేమనాలో అర్థంకాలేదు, దీర్ఘంగా నిట్టూర్చి ఊరుకున్నాను. ఆ తరువాతకూడా మా హాస్టల్లో నాలుగైదుసార్లు డబ్బుపోవడం జరిగింది. హాస్టల్లో ఎవరిడబ్బుపోయినా నేను ప్రకాశాన్నిపిల్చి మందలిస్తూ వుండేవాణ్ణి. ప్రకాశం హాస్టలు విద్యార్థుల సొమ్ము దొంగిలిస్తున్నాడనే విషయం అధికారవర్గానికి తెలియడాని కెంతోకాలం పట్టలేదు. పర్యవసానంగా అతను హాస్టలునుండి త్వరలోనే వెళ్ళగొట్టబడ్డాడు. మరోనాల్లాళ్ళ కతను కాలేజీకూడా మానేశాడు బహుశా గడవకనే అనుకుంటా."

"పాపం అతను స్వతహాగా చాలామంచివాడే!" అనకుండా ఉండలేకపోయింది, అంతవరకూవిన్న సావిత్రి.

"అవును ఆమాట నిజమే. స్వతహాగా అతను చాలా మంచివాడు. పరిస్థితుల ప్రోద్బలంవల్ల అతను దొంగతనం చెయ్యడానికి అలవాటుపడవలసి వచ్చింది. ఆ అలవాటే పరిపాటై అతనిలో 'క్లెప్టోమేనియా' అనే జబ్బు ఏర్పడింది. త్రాగుడు అలవాటైన వ్యక్తి త్రాగకుండా ఎలా ఉండలేడో ఆ జబ్బుగలవాళ్ళు దొంగతనం చెయ్యకుండా ఉండలేరు."

సావిత్రి సావధానంగా లేచి కూర్చుంది. ఏదో విషయాన్ని తెలుసుకోవాలనే ఆత్రుత ఆమె ముఖంలో చూచాయగా ద్యోతకమైంది. డాక్టరువైపుతిరిగి అడిగింది "డాక్టరుగారూ, అతను మళ్ళా మామూలు మనిషి కావడానికి మార్గంలేదా? మీతో మర్మం విడిచి చెబుతున్నాను. అతనితో నాకే ముహూర్తంలో పరిచయమైందో ఆ క్షణం నుండీ నామనస్సతనికి అర్పింపబడింది. మా యిద్దరి హృదయాలూ ఎంతో సన్నిహితమైనాయి. కొద్దిరోజుల్లో నే నతన్ని వివాహం చేసుకోదల్చుకున్నాను కూడా. ఇంతలోనే నేను ఔట్‌డోర్ షూటింగ్‌కి మైసూరు వెళ్ళడం ఏదో దొంగతనం చేశాడన్న నేరంమీద ప్రకాశాన్ని జైల్లోపెట్టడం జరిగింది. విడుదలకాగానే అతన్ని నేను బాగుచేసుకోవాలి. నాకన్న మీ రతని మనస్తత్వాన్ని బాగా పరీక్షించి అర్థం చేసుకున్నారు.

దొంగతనం చెయ్యాలనే బుద్ధినుండి అతన్ని విముఖుణ్ణి చెయ్యడానికి లేదయినా మార్గం సూచించలేరా?"

"నీ మనోవ్యథ సాకర్థమైందమ్మా. అనురాగపూర్వకంగా నీకతనెంత సన్నిహితుడో స్నేహపూర్వకంగా నాకూ అంత సన్నిహితుడే. ఎంతటి విషమపరిస్థితులమధ్య అతను ఆజబ్బుకు గురిచెయ్యబడ్డాడో అంతటి అనుల్లంఘనీయమైన కట్టుబాట్లలో అతన్ని కొంత కాలం ఉంచగలిగితే, అతను మామూలు మనిషి కావడానికి అవకాశముంది."

సావిత్రికళ్లు ఆశతో మెరిశాయి. డాక్టరు వెళ్ళడానికి లేచాడు.

* * *

రోజులు గడుస్తున్నాయి. ఆనాడు అర్ధరాత్రి దాటింది. ప్రకాశాన్ని గూర్చిన ఆలోచనలతో సావిత్రి బుర్ర వేడెక్కిపోతోంది. ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టడంలేదు. మంచంమీదనుండి లేచి వరండాలో చల్లగాలికోసం కుర్చీవేసుకుని కూర్చుంది. ఊహాప్రపంచంలోనున్న సావిత్రిని మధ్యగదిలోనుండి వినపడిన శబ్దం జాగ్రదవస్థలోకి తీసికొనివచ్చింది. సావిత్రి మెల్లగా లేచి వెళ్ళి స్విచ్ వేసింది. గదిలోనున్న బీరువాతలుపులు బారుగా తెరచి వున్నాయి. గదిమధ్య చేతిలో మనీపర్సుతో ప్రకాశం చేష్టలు దక్కి అవనతవదనంతో నిల్చొనివున్నాడు. అతన్ని చూడగానే సావిత్రికి సంతోషాశ్చర్యాలు ఒకేసారి కల్గాయి. అడుగులో అడుగువేసుకొంటూ ముందుకు వెళ్ళి ప్రకాశం చెయ్యిపట్టుకుని సావిత్రి మంచందగ్గరకు తీసికొనివెళ్ళింది. ప్రకాశం మౌనంగా ఆమెను అనుసరించాడు. సావిత్రి అతని వక్షంమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది.

ప్రకాశం మస్తిష్కంలో యేవో ఆలోచనలు ప్రరుగులు తీస్తున్నాయి — తానెవరు? సావిత్రి ఎవరు? తమ యిద్దరికీ ఏమిటి సంబంధం? తనామెను కలుసుకున్న పరిస్థితిలో ఆమె ఎంత సానుభూతి చూపింది! మరొకళ్ళయితే యేమిచేసివుండేవారో? ఆమె తనకు మొదట తన స్నేహాన్నిచ్చింది. తరువాత నిష్కల్మష హృదయాన్నే యిచ్చింది. అటువంటి ఉత్తమురాలి యింటిలోనే దొంగతనం చెయ్యడానికి వచ్చిన తానెంత నీచుడు. పశ్చాత్తాపముతో అతని నేత్రాలు ఆర్ద్రములైనాయి. సావిత్రివైపు తిరిగి ఆమె చేతులు పట్టుని, "సావిత్రీ! నేను నీచుణ్ణి. నీ సాన్నిధ్యంలో ఉండడానికి కూడా అనర్హుణ్ణి. నాలోని యేవో తెలియనిశక్తుల విజృంభణవల్ల అప్పుడప్పుడు నాకు దొంగతనం చెయ్యాలని బుద్ధిపుడుతూ వుంటుంది. విజృంభించే ఆ అంతర్గతశక్తులకు నా మనస్సును వశపర్చకుండా ఉంచడం నా శక్తికి మించిన పని అవుతూంది. లోకం నన్ను దొంగగానూ నీచుణ్ణిగానూ పరిగణిస్తూంది. నన్ను దరిజేర్చి నువ్వు కూడా నీపేరు ప్రతిష్ఠలకు భంగం తెచ్చుకోవద్దు. వచ్చినదారినే నన్ను వెళ్ళనీ. అసలు నువ్వు యిక్కడ ఉన్నావని తెలుస్తే నేను దొంగతనానికి యిక్కడకు వచ్చేవాణ్ణే కానేమో!"

సావిత్రి అతని కడ్డువచ్చి "కాదు ప్రకాశం! లోకం తనకు యిష్టంవచ్చినట్లు అనుకోనీ. లోకంతో నాకేమీ సంబంధం లేదు. నాకు కావలసినదల్లా నువ్వే. స్వతహాగా నువ్వు చాలా మంచివాడివే. కాని పరిస్థితులకు లొంగి దొంగతనం నేర్చుకున్నావు. గట్టిగా తలుచుకుంటే నువ్వీక్షణంనుండీ దొంగతనం చెయ్యడం మానివేయగలవు. దొంగతనం చేయాలనే వుద్దేశం నీలో కలగడానికి వ్యవధి లేకుండా బాధ్యతాయుతమైన పని నీకు అప్పగిస్తే నువ్వు చక్కబడతావు. దానికి తగిన ప్రయత్నాలన్నీ నేను చేశాను. ఇంతకాలం సినీమాల్లో నటించి కొన్ని లక్షలు గడించాము. ఆ ధనంతో మనమే స్వయంగా ఒక ఫిల్మ్ కంపెనీ స్థాపించి సినీమాలు తీద్దాం. ఆ డబ్బును సక్రమంగా ఖర్చుచేసే బాధ్యత నీ మీద ఉంచుతున్నా. రేపటినుండే మనం కార్యోన్ముఖులమవుదాము. ఇక దొంగతనం చెయ్యనని నాచేతిలో చెయ్యివేసిచెప్పు."

ప్రకాశంకళ్ళు కృతజ్ఞతతో మెరిశాయి. "సావిత్రీ! నువ్వు దేవతవు. నా కప్పగించిన పనిని సక్రమంగా నిర్వహిస్తూ యీనాటి నుండీ దొంగతనంపై బుద్ధిమళ్ళకుండా ప్రయత్నము చేస్తాను నీపైన ఆన."

సావిత్రి ఆనందంతో మైమరచి అతని శిరస్సును హృదయానికి హత్తుకుంది.

# వినురవేమ!

రచన: "మను"

ఆంధ్రపౌరుషంబు నాంధ్రులఖ్యాతియు
ఆంధ్రరాష్ట్రమందు వ్యర్థమయ్యె
పెరటిచెట్టు మందుకొరకుపాటించునా
విశ్వదాభిరామ వినురవేమ.

జెయిలుకేగునపుడు సిద్ధస్వార్థత్యాగి
తిరిగివచ్చి స్వార్థపరుడునయ్యె
జెయిలుతోడ మనిషి శీలమేమారురా ||వి||

ఫెయిలుప్రయిసుపొందు గయిరుహాజరుకాగ
నూరులేవని యధికారియొకడు
క్లబ్బులేక గంట గడవదన్నాడురా ||వి||

బ్రతుకలేనివాడు బ్రహ్మవ్రాతనుతిట్టు
చేతగానితనము చెప్పలేక
కొట్టలేనివాడు గొప్పసత్యాగ్రహి ||వి||

పదవికొంచెమునకె పట్టభద్రునిమించు
చదువుసంధ్యలేని చవటయైన
పదవిలేని పట్టభద్రుండుభ్రష్టురా ||వి||

మందబుద్ధియయ్యె మంత్రిచుట్టముగాన
మూడురోజులకె ప్రమోషనయ్యె
పట్టులేనితెలివి పొట్టనిండనికలిమి ||వి||

చేయలేడుతాను చేయించుకొనలేడు
అరచుచుండు పండుకొరకుచుండు
అలుగుటెందుకన్న 'అధికారిన'న్నాడు ||వి||

